# బాలల కథలు - మనోవికాసం

139

పత్రసమర్పణ
శ్రీమతి కొలిపాక అరుణ
అధ్యాపకురాలు, తెలుగుశాఖ
సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిసా స్వయంప్రతిపత్తి మహిళా డిగ్రీకళాశాల, ఏలూరు, ప॥గో॥జిల్లా.
e-mail ID : kanuri.aruna80@gmail.com, Cell : 9346779855



పిల్ల దేవుడు చల్లనివారే
కల్ల కపట మెరుగని కరుణామయులే అన్నారు ఆరుద్రగారు.

"శిశుత్వం శైశవం బాల్యం" అని అమరకోశం చెప్తుంది. "బాలస్య భావ: బాల్యమ్" అని వ్యుత్పత్తి. బాలుని యొక్క భావం బాల్యం. 16 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు బాలలుగా పరిగణింపబడతారు.

తిరిగిరాని మరువలేని - మధుర జ్ఞాపకం బాల్యం
మనసు పాడుకునే - మధుర గీతం బాల్యం
మనసు ఆడుకునే - మధుర క్రీడ బాల్యం
నిర్మలమైన కమ్మనైన - మధుర కావ్యం బాల్యం

అటువంటి అందమైన బాల్యంలోనే చిన్నారులు తల్లిదండ్రుల నుండి, సమాజం నుండి, పాఠశాల నుండి నేర్చుకోవడం మొదలుపెడతారు. విత్తనాలు తీసుకుని పలు ప్రాంతాలలో చల్లితే, ప్రాంతాన్ని బట్టి ఫలసాయం మారినట్టే పిల్లల పరిసరాలు వారి బాల్యం పై ప్రభావం చూపుతాయి. చిన్నారులు పెద్దల సమక్షంలో వివిధ సంస్కార భావాలు నేర్చుకుంటారు.

ఉందో లేదో స్వర్గం నాపుణ్యం నాకిచ్చెయ్
సర్వస్వం నీకిస్తా....నా బాల్యం నాకిచ్చెయ్

అంటూ తటవర్తి రాజగోపాలం గారు వారి గజల్‌లో బాల్యాన్ని వర్ణించారు. బాల్యం తిరిగియిస్తే తన సర్వస్వం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు అంటే బాల్యం ఎంత అమూల్యమైనదో అర్థమవుతుంది.

జీవిస్తే పసి పిల్లల్లాగా జీవించాలంతే
మరణించామా యోధుల్లాగా మరణించాలంతే

అంటారు డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావుగారు వారి గజల్‌లో. ఈ విధంగా వివిధ సాహిత్య ప్రక్రియలలో వెలకట్టలేని బాల్యాన్ని వర్ణించారు కవులు, రచయితలు.

బాలలు భావితరానికి దివ్వెలు, నవసమాజ నిర్మాతలు. ఇటువంటి వీరి వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదులు బాల్యంలోనే వేయబడతాయి. అటువంటి సమయంలో వారి చిన్ని మనసులో నాటుకున్న అభిప్రాయాలు, ఏర్పడిన భావాలు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా ఉండాలి. అభిప్రాయాలు, భావాలు అనేవి వినడం, చూడడం, చదవడం ద్వారా మాత్రమే ఏర్పడతాయి. వినడంలో ప్రముఖ పాత్ర వహించేవి కథలు. రాజ్యాలు, రాజులు, అందమైన పగడపు దీవులు, రెక్కల గుర్రాలు, జంతువులు మాట్లాడటం ఇవన్నీ కథలపట్ల చిన్నారులకు ఆసక్తిని కలిగించే విషయాలు. ఇటువంటి బాలలకు వివిధ వార, పక్ష, మాస పత్రికలు ప్రచురిస్తున్న కథలు మరింత ఆసక్తికరంగా ఉంటున్నాయి అనడంలో సందేహం లేదు.

పిల్లల మనస్సుకు హత్తుకునే విధంగా, అర్థమయ్యే చిన్ని చిన్ని పదాలతో, కుటుంబంలోని, తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలు చెప్తున్నట్టుగా, స్నేహితులతో మాట్లాడుతున్నట్టుగా చక్కని సందేశాల సమాహారంగా ఈ చిన్ని కథలు రాస్తున్న రచయితలందరూ మిక్కిలి అభినందనీయులు. చిన్నారులు ఈ చిట్టి కథలపై మొగ్గుచూపుతూ ఉండటం బాల సాహిత్యానికే గర్వకారణం. ఈ చిన్ని కథలలో సందేశం ఏ విధంగా అందించారో చూద్దాం.

'ఉంగరాల బంగారయ్య' అనే కథను కె.కె.రఘునందన (విజయనగరం) రాశారు. ఈ కథలో బంగారయ్య అనే ధనవంతుడు వేళ్ళకు ఖరీదైన ఉంగరాలు ధరించి తిరుగుతాడని అంతా 'ఉంగరాల బంగారయ్య' అని పిలిచేవారు. మిత్రులందరికీ తన ఉంగరాలను గర్వంగా చూపిస్తూ ఉంటే వాళ్ళంతా "మీతో ఎవరూ పోటీ పడలేరని" పొగడ్తలతో ముంచెత్తేవారు. ఆ పొగడ్తలకు తనంతవారు లేరని మరింత గర్వంతో విర్రవీగేవాడు ఉంగరాల బంగారయ్య. ఓరోజు ఓ సన్యాసి బంగారయ్యతో "నీ సంపద చూసి అందరూ అసూయ పడుతున్నారని, నరఘోష తగులుతుందని తగ్గాలంటే విరివిగా దాన ధర్మాలు చెయ్యి" అంటాడు. అన్నదానం, వస్త్రదానం చేయడం మొదలుపెట్టాడు బంగారయ్య. ఇప్పుడు గ్రామప్రజలు అతని దానశీలతను మనస్ఫూర్తిగా మెచ్చుకుంటారు. ఆ నాటి నుండి తనకు తెలిసిన సహాయం చేస్తూ జనాలకు మరింత చేరువయ్యాడు బంగారయ్య. మనకున్న సంపాదనలో కొంతైనా జనాలకు ఉపయోగపడినప్పుడే మనుషులు మనస్ఫూర్తిగా చేరువవుతారని, అప్పుడే నిజమైన విలువ ఏర్పడుతుంది అన్న సత్యాన్ని గ్రహించాడు బంగారయ్య.

బొబ్బిలికి చెందిన శివ్వాం ప్రభాకర్‌గారు రాసిన 'స్వయంకృషి' అనే కథలో సన్యాసప్పడు కిరాణావ్యాపారి అతని కొడుకు అభిషేక్. ఇతడు మంచి ఉద్యోగం కోసం లంచం చెల్లించాల్సివచ్చింది స్వంతంగా వ్యాపారం చేసి, న్యాయంగా డబ్బు సంపాదిస్తానని ఎంతగా చెప్పినా తండ్రి ఇష్టపడలేదు. కానీ జీవితంలో స్వంతంగా ఎదగాలని అనుకున్న అభిషేక్ పుస్తకాలు అమ్మేదుకాణంలో పనివాడిగా చేరి నమ్మకంగా పని చేయడంతో అతని నిజాయితీకి మెచ్చి లాభంలో వాటా ఇచ్చాడు యజమాని.

వ్యాపారంలోని మెళకువలను నేర్చుకున్న అభిషేక్ యజమాని ఇచ్చిన డబ్బుతో చిన్నగా వ్యాపారం ప్రారంభించి అంచెలంచలుగా ఎదుగుతూ గొప్ప వ్యాపారవేత్తగా, పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలు పంచే మంచి మనసున్న వ్యక్తిగా సమాజంలో పేరు తెచ్చుకొన్నాడు. కష్టపడి పనిచేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అనీ, అలాగే నీతీ, నిజాయితీ దాన ధర్మాలు సమాజంలో నిజమైన కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెడతాయి అని ఈ కథ ద్వారా అర్థమవుతుంది. స్వయంకృషి ఉంటే ప్రయోజకులు కావచ్చు అన్నది ఈ కథలోని సందేశం.

'కుందేలు చాతుర్యం' అనే కథను నరసరావుపేటకు చెందిన పరాశరం శ్రీనివాసాచార్యులు వ్రాసారు. జిత్తులమారి నక్క కుందేలును తిందామని దగ్గరకు వచ్చేసరికి కుందేలు ఏడుస్తూ "నీకన్నా తెలివైన జిత్తులమారి జంతువు ఒకటి అడవికి వచ్చింది. అది ఎదురుపడితే తప్పించుకోవడానికి నీ శక్తి యుక్తులు చాలవు" అని అంటుంది. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ నక్క ఉపాయం అడుగుతుంది. "నీటి మడుగులో దాక్కుని నోరు తెరవకుండా మనస్సులో మంత్రం జపిస్తే నీకు తిరుగు ఉండదు. భూమ్మీద పుట్టిన ఏ జంతువు నిన్ను ఎదిరించలేదు" అని చెప్తుంది. అడవిలో ఉన్న అన్ని జంతువులకన్నా శక్తిమంతురాలు కావాలనే ఆకాంక్షతో ఆవిధంగా నీటి మడుగున దిగి దీక్షగా మంత్రాన్ని మనసులో పఠిస్తుంది. ఊపిరాడక గిలగిలకొట్టుకుని మరణిస్తుంది నక్క. జిత్తులమారి నక్కను కడ తేర్చినందుకు కుందేలుకి ఘనంగా సన్మానం చేసి, మృగరాజుకి సలహాదారుగా నియమించారు. కుందేలు చిన్న జంతువు అయినప్పటికీ బుద్ధి చాతుర్యంతో నక్కబారి నుండి తనను తాను రక్షించుకోవడమే కాకుండా ఇతర జంతువులను కూడా కాపాడింది. కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా బుద్ధిబలం ఉపయోగించాలనే విషయం ఇక్కడ కనిపిస్తుంది.

కెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి (హైదరాబాదు) రాసిన 'ఒక్క మంచి లక్షణం' అనే కథలో రంగమ్మ, రత్తయ్యల కుమారుడైన సత్తెయ్య సోమరితనంతో ఉన్నప్పటికీ అంతిమదశలో ఉన్న తండ్రి "ఏదైనా ఒక్కమంచి లక్షణం నేర్చుకో" అని చెప్పిన మాటను గుర్తు పెట్టుకున్నాడు. "సత్యమే మాట్లాడతాను" అని ధృడ నిశ్చయంతో తండ్రికి మాట ఇస్తాడు. రాజుగారి నగలు దొంగిలించిన కొందరు దొంగలను గుర్తించడంలో నిజయితీగా ప్రవర్తించి, ఉరిశిక్షపడిప్పటికీ అబద్ధం చెప్పకపోవడం, నిజాయితీ వీడకపోవడాన్ని గుర్తించిన రాజు అతనికి కోశాధికారి పదవిని కట్టబెట్టడం జరిగింది. మనం అలవరచుకునే ప్రతీ మంచి లక్షణం మనకు అమూల్యమైన ఫలితాన్ని ఇస్తుంది అనేది ఈ కథలోని నీతి.

'కేశవుడి సంగీతం' అనే కథను డి.కె.చదువుల బాబు (ప్రొద్దుటూరు, కడప) రాసారు. చక్రపురాన్ని పరిపాలించే రాజు విజయసేనుడు. ఇతడికి సంగీతమంటే ప్రాణం. సంగీత కళాకారుల్ని ప్రోత్సహిస్తూ ఉండేవాడు. నిత్యం ఎంతో మంది కళాకారులు రాజుగార్ని కలవడానికి వస్తూ

ఉండేవారు. రాజుభటులు, చిన్న ఉద్యోగులు భారీగా లంచాలు వసూలు చేసేవారు. ఈ విషయాన్ని ఎలా అయినా రాజుగా దృష్టికి తీసుకురావాలని అనుకున్న కేశవుడు భటులకు లంచాలిచ్చి విజయసేనుని దగ్గరకు వచ్చి అతని అనుమతితో వాయిద్య పరికరంతో కచేరీ ప్రారంభించి విషాద రాగాలను పలికిస్తాడు. రాజు కోప్పడ్డాడు. "మహారాజా! రాజ్యమంతటా లంచగొండితనం, అవినీతి పేరుకుపోయింది చిన్న ఉద్యోగం నుండి పెద్ద అధికారి వరకు అవినీతిలో మునిగి ఉన్నారు. మీ వరకు ఈ విషయం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. వీరికి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం లేక సామాన్యులు మిన్నకున్నారు అని వివరించాడు. ఈ కథలో నీతి నిజం చెప్పేందుకు ఎన్నుకునే పద్ధతి నేర్పుతో కూడినదై సమయస్ఫూర్తి, ధైర్య సాహసాలు ఉండాలి.

జంజం కోదండరామయ్య (జమ్మిపాళెం, నెల్లూరు) రాసిన 'ప్రతిఫలం' అనే కథలో సందేశం ఈ విధంగా ఉంది శివయ్య పల్లెటూల్లో రైతు, అడిగినవాళ్ళకి లేదనకుండా సహాయం చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. అతని కొడుకు సూరి. తండ్రి అందరికీ సహాయం చేస్తున్నందుకు కోపగించుకునేవాడు. కొంతకాలం తర్వాత శివయ్య ఊర్లోలేని సమయంలో పంట బళ్ళకు ఎత్తించి ఇంటికి తీసుకుని వస్తుండగా ఎడ్ల బండి రెండు చక్రాలు బురదలో కూరుకుపోయాయి. ఆ దారిలో వెళుతున్న కొందరు గబగబా వచ్చి సహాయం చేసారు. మనం సహాయం చేసిన వాళ్ళే మనకు సహాయం చేయాలనీ, చేస్తారని లేదు. మనం ఎవ్వరికి మంచి చేసినా దేవుడు ఏదో ఒక రూపంలో మనకు సహాయం చేస్తాడు. మానవ సేవే మాధవ సేవ అన్న సందేశాన్ని తెలియజేసారు రచయిత.

ఈ విధంగా కథా రచయితలు చిన్నారులకు పలు సందేశాత్మక కథలు అందించారు. పుస్తక పఠనము, సత్సాంగత్యము ద్వారా విద్యార్థులు చక్కటి జ్ఞానాన్ని అలవరచుకుంటారు. కానీ ఈ రోజుల్లో పిల్లలు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితమౌతున్నారు. ఎందరో కవులు, రచయితలు బాలలకోసం రాసిన సాహిత్యమెంతో పఠనానికి నోచుకోవడం లేదు. ఇదే విషయం హెచ్.ఆర్.చంద్రంగారు ఈ క్రింది పద్యంలో ఈ విధంగా చెప్పారు.

పాఠ్యపుస్తకాలె తగని భారమాయె!
చదువుకొన బాలలకు నింకమయమేదీ?
ఎవరికోసము బాలసాహిత్య సృష్టి
తెలియదగు లోకరీతి ఈ తేటగీతి

బాలలకు ఏ మాత్రం సమయం దొరికినా అంతర్జాలంలో, దూరదర్శని, చరవాణీలతో గడపడానికే ఇష్టపడుతున్నారు. అలా కాకుండా పిల్లలను పుస్తక పఠనం వైపు మళ్ళించవలసిన బాధ్యత ప్రతీ తల్లిదండ్రులపై ఉంది. బాలలను నీతి, నిజాయితీ గల భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో, మానసిక వికాసాన్ని కలిగించడంలో ఈ చిన్ని కథలు ఎంతగానో తోడ్పడతాయి.